


# స్పీడ్ బ్రేకర్

◀ నాపూరు శ్రీధర్

తుపాకి చేతిలో వున్నవాడికి ప్రేల్చాలన్న కోరిక పుట్టే విధంగానే, వాహన మెక్కిన వాడికి వేగంగా వెళ్ళాలనిపిస్తుంది. వేగాన్నీ, సాహసాన్నీ ప్రేమించే యువతకైతే ఇక చెప్పనక్కర్లేదు. పెద్దవాళ్ళు చేసే హెచ్చరికలో భయమే తప్ప భద్రత వున్నట్టనిపించదు.

వేగం ఎవరికైనా అద్భుతంగానే వుంటుంది కానీ, సాధారణ జీవితానికి అవసరం లేనిది. పరుగెత్తి పాలు తాగడానికన్నా నిలబడి నీళ్ళు తాగాలనుకుంటుందది. అందులో ఆత్మీయబంధం కూడా వుందా, ఆ వేగం రెక్కలను కత్తిరించి అయినా తన వొడిలో ఇమిడేట్టు చేసుకుంటే తప్ప స్థిమితం వుండదు దానికి.

బ్యాంక్ అవర్స్ ఐపోగానే ఇంటికొస్తున్నాడు బ్యాంక్ మేనేజర్ జయదేవ్.

''ఇదిగో ఈ ఫ్యాన్సీ స్టోర్స్ దగ్గర కొద్దిగా ఆపవోయ్''

రిక్షా ఓ ఫ్యాన్సీ స్టోర్ ముందు ఆగింది.

రిక్షాలోంచి దిగిన జయదేవ్ ఫ్యాన్సీ స్టోర్స్ లోంచి ఓ బ్లేడ్స్‌ప్యాక్ కొనుక్కొచ్చి రిక్షా ఎక్కబోతున్నాడు. ఇంతలో ...

టప ... టప ... టప ... మంటూ సైలెన్సర్ వూడబీకిన ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ ఆ రిక్షా ముందు నుండి పెద్ద శబ్దం చేసుకుంటూ ప్రక్క వీధిలోకి దూసుకెళ్ళింది.

ఆ శబ్దానికి తల త్రిప్పి చూశాడు యాభై నాలుగు సంవత్సరాల జయదేవ్. ఆ బుల్లెట్ మీద దూసుకెళ్ళింది జయదేవ్ ఏకైక కుమారుడు ప్రవీణ్...!

బ్రీఫ్‌కేస్‌ని మళ్ళీ రిక్షాలో వుంచి ఎక్కబోతున్నాడు ...

రిక్షా అతను మాత్రం ఆ మోటర్ సైకిల్ వెళ్ళిన వైపు ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

''వూ... ఇక బయల్దేరుదామా?'' అడిగాడు జయదేవ్ రిక్షాలో కూర్చుంటూ.

రిక్షా అతను రిక్షా త్రొక్కుతూ ... ''బాబో ఆ ఈదిలోకి టప్ టప్ మోటర్ మీన జర్ర్ర్ ...జర్ర్ర్ర్...మని దూసుకెల్నాడే ఆ అబ్బా ఎవురోగాని బండి మా జోరుగా, పేసనుగా తోల్తాడు బాబు''!

తన ముందు తన కొడుకుని పొగుడుతుంటే గర్వంగా జయదేవ్ పెదాలమీద సన్నటి నవ్వు మెరిసింది.

మళ్ళీ రిక్షా అతను చెప్పడం ప్రారంభించాడు.

''కానీ బాబో నేను టౌన్లో రోజూ చూస్తుంటా గందా ... మన దేశం రోడ్ల మీన ఆ బాబు బండి తోలడం కంటే ... అదేందీ ... ఆ ... అమెరికా దేశం రోడ్ల మీన తోత్తే యమా నయిసుగా వుంటదిలే...!''

అప్పటివరకు కూడా ఆ మాటలు వింటున్న జయదేవ్‌కి మనసు ఆనందంగా వుంది.

''ఒకేల యాక్సెంటు జరిగిందే అనుకో... ఈ బాబు కంటిక్కూడా అవుపడ్డు బాబో ... ఆ స్పీడు మింద ఏ లారీకో, బొస్సుకో గుద్దేడంటే బాబో ... టప టప మోటారుతో సహా బంపరు కిందకి దూరి పొయ్యి ముక్కలు... ముక్కలు... ముక్కలైపోతాడు బాబో''! చెప్పుకుంటూ రిక్షాని ఫెడల్ చేస్తున్నాడు.

ఆ చివరి మాటలు విన్న జయదేవ్‌కి మనసంతా చేదుగా తయారయింది. తన ఏకైక సంతానం ప్రవీణ్‌కి ఇప్పుడు పాతిక సంవత్సరాలు. చిన్నప్పట్నుండి కూడా వేగంగా పనులు చెయ్యడం

వాడికి అలవాటు. ప్రవీణ్ పోస్టు గ్రాడ్యుయేషన్ చేసేటప్పుడు వాడి కోరిక మీద ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ కొనిచ్చాడు తను. ప్రవీణ్ ఆ మోటార్ సైకిల్‌ని వేగంగా నడపడానికి అపరిమితమైన ఆనందాన్నీ, ఉత్సాహాన్నీ కనబరుస్తాడు. ఆ వూర్లో వున్న తన స్నేహితులు, కొలీగ్స్ అందరూ చాలాసార్లు ప్రవీణ్ స్పీడ్ డ్రైవింగ్‌ని గురించి తనకు చెబుతుండేవారు. మొదట మొదట్లో తనకు చాలా గర్వంగా వుండేది.

తర్వాత తర్వాత తన స్పీడ్ డ్రైవింగ్‌ని అదుపు చెయ్యాలని చూసిన ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌కి మామూళ్ళిచ్చి వాళ్ళ దృష్టిని మళ్ళించాడు ప్రవీణ్. మూడు నాలుగుసార్లు ఆ టౌన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌ని మందలించి ... తనకు బ్యాంక్‌కి ఆ విషయాన్ని గురించి ఫోన్ చేసేవాడు. అలా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ చేసినప్పుడల్లా తను కూడా ప్రవీణ్‌ని తీవ్రంగా మందలిస్తుండేవాడు

ప్రవీణ్ ఎందుకనో ఆ ప్రమాదకరమైన అలవాటుని మానుకోలేకపోతున్నాడు. ఒక రకంగా చెప్పాలంటే ... తాముండేది చిన్న టౌను కాబట్టి ఇంచుమించుగా ఆ వూర్లో ప్రజలందరికీ ప్రవీణ్ ఓ సూపర్ డ్రైవింగ్ హీరోగా పరిచితుడే.

"బాబుగారూ ఏ యింటి ముందు ఆపమంటారండీ" రిక్షావాడి పిలుపుకి జయదేవ్ ఆలోచనలు తెగిపోయాయి.

"ఆ...ఆ... అదిగో ఆ పచ్చ మేడ ముందు ఆపు" చెప్పాడు జయదేవ్. రిక్షా దిగి బ్యాంక్ ఫైల్స్ వున్న బ్రీఫ్‌కేస్ తీసుకుని ఇంట్లోకి నడుస్తూ 'ప్రవీణ్‌ని డ్రైవింగ్ స్పీడ్ తగ్గించమని ఈ రోజు గట్టిగా మందలించాలి'! మనసులో అనుకున్నాడు జయదేవ్.

అప్పటికే ప్రవీణ్ బాత్‌రూంలో స్నానం చేస్తున్నాడు.

కొద్దిసేపటి తర్వాత బాల్కనీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు జయదేవ్. బాల్కనీ లోంచి అతని కంటికి నేరుగా పోర్టికో ముందు స్టాండ్ చేసిన ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ నల్లగా నిగనిగలాడుతూ కనిపిస్తోంది. బండిని నీట్‌గా మెయిన్‌టెయిన్ చేయడం ప్రవీణ్‌కి అలవాటు. ఆ మోటార్ సైకిల్‌ని చూస్తుంటే ... ఇదెక్కడ తన ఒక్క గానొక్క కొడుకుని దూరం చేస్తుందోననిపిస్తోంది.

అంతలో జయదేవ్ భార్య అన్నపూర్ణ కాఫీ కప్పుతో బాల్కనీలో కొచ్చింది. "వూ... ఇది గోండి కాఫీ ... త్వరగా కాఫీ త్రాగి స్నానం చెయ్యండి. ఈ రోజు సోమవారం శివాలయానికి వెళ్ళొద్దాం" చెప్పింది.

"ఈ రోజెందుకో నాకు గుడికి రావాలని లేదోయ్"... నీ గారాల సుపుత్రుడు ఇంట్లోనే వున్నాడుగా వాణ్ణి తీసుకెళ్ళు. బండి మీద త్వరగా వెళ్ళి వచ్చేయొచ్చు" చెప్పాడు జయదేవ్.

"ఏమిటీ ... ప్రవీణ్ బండి మీద ... అమ్మో ... నేను వాడి బండి మీద కూర్చొని ఎక్కడికీ వెళ్ళను బాబూ. ప్రవీణ్ డ్రైవింగ్‌లో వెనుక కూర్చుంటే ... శివాలయానికి కాదు నేరుగా ఆ శివుడి కైలాసానికే వెళ్ళిపోతాం. అవన్నీ కుదిరే పన్లు కాదు గానీ మీరు చప్పున తయారవ్వండి. వెళ్ళొచ్చేద్దాం" కాఫీ సిప్ చేస్తోన్న జయదేవ్‌కి చెప్పి ఇంట్లోకెళ్ళిపోయింది అన్నపూర్ణ.

"హాయ్ డాడీ ... గుడీవినింగ్" తల దువ్వుకుంటూ బాల్కనీలోకి వచ్చి జయదేవ్ ముందుకి ఓ కేన్ చేర్ లాక్కుని కూర్చున్నాడు ప్రవీణ్.

'గుడీవినింగ్ ప్రవీణ్' కప్పు టీపాయ్ మీద పెట్టేస్తూ చెప్పాడు జయదేవ్.

"ఈ రోజు గుడికి వెళ్ళాలట. మీరు త్వరగా రెడీ అవ్వండి ... అమ్మ లోపల్నుండి కేక లేస్తోంది" చెప్పాడు ప్రవీణ్.

ఏం సమాధానం చెప్పకుండా ప్రవీణ్ కేసి చూస్తున్నాడు జయదేవ్.

"ఆ ... అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. నెక్స్ట్ సండే బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ కోసం హైదరాబాద్ వెళ్ళాలి. టిక్కెట్ రిజర్వ్ చెయ్యమన్నారుగా ... ఈ రోజు ఉదయం టిక్కెట్ రిజర్వ్ చేశాను. అలాగే మండే నేను ఢిల్లీకి ఇంటర్వ్యూకి వెళ్ళాలిగా అందుకు నా ఢిల్లీ టిక్కెట్ కూడా రిజర్వ్ చేయించుకున్నాను."

"గుడ్ ... వెరీ గుడ్ ప్రవీణ్. ఈ రోజు నీకో ముఖ్య విషయం చెప్పాలనుకుంటున్నాను. ఏమైనా సరే డ్రైవింగ్ స్పీడ్ తగ్గించాల్రా"! నిదానంగా చెప్పాడు జయదేవ్.

"మళ్ళీ మామూలు పాటేనన్న మాట! చూడండి డాడీ అసలలాంటి బండి మీద స్లోగా వెళ్తే ఏం బావుంటుంది చెప్పండి! ఐనా ఈ వయసులో కాకపోతే ఇంకెప్పుడు స్పీడ్‌గా డ్రైవ్ చెయ్యగలం చెప్పండి"? నవ్వుతూ జయదేవ్ మాటకి ప్రశ్నరూపంలో సమాధానం చెప్పాడు.

"ఈ విషయంలో నిన్ను ఒప్పించడం చాలా కష్టమైపోతోంది ప్రవీణ్. ఏమైనా సరే నువ్వు స్పీడ్ తగ్గించాల్సిందే"!

"ఓకే డాడీ, మీ మాట ప్రకారం నేను బండిని స్పీడ్‌గా డ్రైవ్ చెయ్యడం తగ్గించేస్తాను! బట్ ఒన్ కండిషన్"?

ఆ కండిషన్ ఏమిటా అన్నట్టు ఆశ్చర్యంగా ప్రవీణ్‌కేసి చూస్తున్నాడు జయదేవ్.

"నాకు ... నాకు మీ వయస్సు వచ్చిన తర్వాతే నా డ్రైవింగ్‌లో స్పీడ్ తగ్గుతుంది" నవ్వుతూ ఇంట్లోకెళ్ళిపోయాడు ప్రవీణ్.

జయదేవ్ ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టి చూస్తుండిపోయాడు.

* * * *

> కళాకారునికి ప్రపంచమంతా కథావస్తువే. కానీ, కళాకారుడు ఎప్పుడు వాస్తవ జగత్తుపైనా, తనపైనా అసంతృప్తి కలిగి వుండాలి. అంటే తన కృషిలో పరిపూర్ణత సాధించానన్న అభిప్రాయం కళాకారునికి రాకూడదు. తన రచనలను ఇంకా ఎక్కువ కళాత్మకంగా తీర్చి దిద్దడానికి నిరంతర కృషి చేయాలి — గోర్కీ
>
> సేకరణ: తవుటు నాగభూషణం

గూడూరు...

సోమవారం

5-50 పి.యం.

"చూడు అన్నపూర్ణా, నువ్వు మరీ గారాబం చేయడం వల్లే వీడిలా తయారయ్యాడు. ఈ రోజు మధ్యాహ్నం ప్రవీణ్ ఏం చెప్పాడో తెలుసా...?

'డాడీ ఈవినింగ్ నేనొచ్చి మిమ్మల్ని స్టేషన్‌లో డ్రాప్ చేస్తాను. అప్పటివరకు మీరు ఇంట్లో నుండి కదలొద్దని చెప్పాడు. ఇక ట్రైన్‌కి పది నిమిషాలే వుంది. ఈ ట్రైన్ మిస్సయితే నేను సరైన సమయానికి కాన్ఫరెన్స్‌కి అటెండవ్వలేను" గాభరాపడుతూ చెప్పాడు జయదేవ్.

"కాస్త ఓపిక పట్టండి! ఈపాటికే వచ్చేస్తుంటాడు. ఏదైనా పని మీద వెళ్ళుంటాడు" జయదేవ్‌కి కోపం రాకుండా వుండేందుకు ప్రయత్నిస్తోంది అన్నపూర్ణ.

"ఆ ... ఆ వచ్చేస్తాడు ఆ ట్రైన్ వెళ్ళిన తర్వాత వస్తాడు. పనీ పాటూ లేదు. ఫ్రెండ్స్‌తో షికార్లు చేస్తుంటాడు. అయినా వాడే పొరపాటు. నేను హాయిగా ఏ ఐదు గంటలకో రిక్షాలో బయల్దేరి వుంటే ఈ సమయానికి ఎలాంటి

టెన్షన్ లేకుండా స్టేషన్‌లో వుండేవాళ్లే" కొంచెం హార్డ్‌గా అన్నాడు జయదేవ్.

అన్నపూర్ణమ్మగారు ఆ వీధి చివర వరకూ తన దృష్టిని సారించి చూస్తోంది.

సరిగ్గా అప్పుడే వేగంగా బుల్లెట్ మీద వస్తున్న ప్రవీణ్ కనిపించాడు.

"ఏమండీ ... మన బాబు వచ్చేస్తున్నాడండీ ... త్వరగా బయల్దేరండి. మిమ్మల్ని మరో క్షణంలో స్టేషన్‌లో దింపి ట్రైన్‌కి అందించేస్తాడు."

ప్రవీణ్ రాకకి మనసులో ఆనందంగానే వున్నా జయదేవ్ ముఖంలో మాత్రం చిరాకు స్పష్టంగా కనిపిస్తోంది.

ఇంటి ముందు బండిని స్టాండ్ చేసి గబగబ అడుగులేసుకుంటూ వచ్చి, "సారీ డాడీ ... ఫ్రెండ్స్ బలవంతం మీద సినిమా కెళ్ళాల్సొచ్చింది! మిమ్మల్ని స్టేషన్‌లో డ్రాప్ చెయ్యాలనే విషయం మర్చిపోయాను. అయామ్ రియల్లీ సారీ ... కమాన్ డాడీ ... కమాన్ ... మిమ్మల్ని క్షణాల్లో స్టేషన్ దగ్గర డ్రాప్ చేస్తాగా ... ఇంకా ఐదు నిమిషాలు టైముంది డాడీ" అంటూ ధీమాగా చెప్పాడు ప్రవీణ్. అప్పటికే జయదేవ్ బ్రీఫ్‌కేస్ తీసుకుని బుల్లెట్ వెనుక కూర్చున్నాడు.

క్షణంలో బలంగా కిక్ కొట్టి బండిని స్టార్ట్ చేశాడు. ఒక్కసారిగా క్లచ్ వదలి ఎక్సిలేటర్‌ని రెయిజ్ చేశాడు.

"బాబూ ప్రవీణ్ జాగ్రత్త" అని అరుస్తోన్న అన్నపూర్ణమ్మగారి మాటలు బండి శబ్దంలో కలిసిపోయాయి. ప్రవీణ్ బుల్లెట్ రైల్వేస్టేషన్‌కి దూసుకెళుతోంది. ఐదు నిమిషాల్లో రైల్వేస్టేషన్ ముందు ఆగింది ప్రవీణ్ మోటార్ సైకిల్. గబగబా స్టాండ్ చేసి ఇంచుమించుగా పరుగు పెడుతూ స్టేషన్‌లో ప్రవేశించారు ప్రవీణ్, జయదేవ్.

హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ లోంచి దిగిన ప్యాసింజర్స్ వీళ్ళకి ఎదురు రావడం కనిపించింది. జనాన్ని తోసుకుంటూ ఇద్దరూ ప్లాట్‌ఫాం మీదకి వెళ్ళారు. అప్పటికే ట్రైన్ ప్లాట్‌ఫాంని దాటి మెల్లగా వేగాన్ని పుంజుకుంటోంది.

'జస్ట్ డిపార్చర్'!

నీ వల్లే నేను ఈ ట్రైన్‌కి అందుకోలేకపోయాను అని అనలేదు గానీ ఆ అర్థం స్ఫురించేటట్లుగా ప్రవీణ్‌కేసి మిర్రి మిర్రి చూస్తున్నాడు జయదేవ్.

అప్పుడు ప్రవీణ్ తండ్రి కోపాన్ని పట్టించుకునే స్థితిలో లేడు. ఎలాగైనా సరే ఈ ట్రైన్‌ని క్యాచ్ చెయ్యాలన్నదే అతని ఆలోచన.

కొన్ని లిప్తల కాలంలోనే అతని ఆలోచనలకు ఓ రూపం ఏర్పడింది. బ్రీఫ్ కేస్ తీసుకుని వడివడిగా నడుస్తూ "కమాన్ డాడీ... కమాన్ మూవ్" చెప్పాడు.

"ఎక్కడికి ఇంటికేగా...? నిదానంగానే వెడదాం లే"...! కోపంగా చెప్పాడు జయదేవ్.

"మాటలు తర్వాత, ముందు మీరు నా బండి వెనుక కూర్చోండి"!

ప్రవీణ్ ఏదో మిరకిల్ చెయ్యబోతున్నాడని అర్థమైంది జయదేవ్‌కి.

"డాడీ గట్టిగా పట్టుకోండి" చెప్పి బలంగా కిక్ కొట్టి బండిని ముందుకి దూకించాడు. టౌన్లోని ట్రాఫిక్‌ని చాకచక్యంగా తప్పించుకుంటూ వేగంగా నడుపుతున్నాడు. సెంటర్లో ట్రాఫిక్ సిగ్నల్ బోర్డ్‌లో రెడ్‌లైట్ వెలిగి ట్రాఫిక్ ఆగిపోవలసివచ్చినప్పటికీ ప్రవీణ్ పట్టించుకోలేదు. బండిని వేగంగా ముందుకి దూకిస్తున్నాడు. అప్పటికీ ట్రాఫిక్ కానిస్టేబుల్ విజిల్ వేస్తూ అరుస్తున్నాడు.

అప్పటికే ప్రవీణ్ బుల్లెట్ బైపాస్ రోడ్డు మీదుంది.

"ప్రవీణ్ ఏమిటీ స్పీడు? ఇప్పుడు మనం ఎక్కడికెళుతున్నాం" ఆదుర్దాగా ప్రశ్నించాడు జయదేవ్.

వేగంగా డ్రైవ్ చేస్తూనే అడిగాడు ప్రవీణ్ "డాడీ హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ నెల్లూర్లో స్టాపింగ్ వుంది కదూ...?"

"ఆ! వుంది!"

"మీరు గట్టిగా పట్టుకుని కూర్చోండి డాడీ" అంటూ ఎక్సిలేటర్‌ని మరింతగా రెయిజ్ చేశాడు. బైపాస్ రోడ్డు మీద ట్రాఫిక్ చాలా తక్కువగా వున్నప్పటికీ వేగంతో ఎదురుగా వచ్చే లారీలు, బస్‌లు సర్... సర్‌మని వీళ్ళని దాటుకుంటూ వెళుతున్నాయి.

జయదేవ్ ఆలోచిస్తున్నాడు. ప్రవీణ్ ఇప్పుడు నెల్లూరికి వెళుతున్నాడన్న మాట! అయినా ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌తో పోటీపడి ట్రైన్ నెల్లూర్లో ఆగేలోపల తనని నెల్లూరు స్టేషన్‌లో దింపగలడా...? ఇక్కడ్నుండి నెల్లూరు ముప్పై అయిదు కిలోమీటర్లు! ఆ దూరాన్ని ట్రైన్‌తో సమానంగా కాదు... కాదు... కొన్ని క్షణాలయినా సరే ట్రైన్ కంటే ముందు వెళ్ళగలడా?

అలా పదిహేను కిలోమీటర్లు ప్రయాణించిన ప్రవీణ్‌కి లెవల్ క్రాసింగ్ దగ్గర ట్రాక్ మీద వేగంగా వెళుతున్న ట్రైన్‌ని చూసి ఎక్సిలేటర్‌ని మరి కొద్దిగా పెంచాడు. అండర్ బ్రిడ్జ్ మీద వేగంగా వెళుతున్న ట్రైన్‌ని చూసి నిరాశపడలేదు.

గాలిని చీల్చుకుంటూ ముందుకు దూసుకెళుతోంది ప్రవీణ్ బుల్లెట్. అలా మరో పదిహేను నిమిషాలు ఒకే వేగంతో ప్రయాణించిన ప్రవీణ్‌కి మనుష్య సంచారం కనిపించడం మొదలు పెట్టారు! అంటే... నెల్లూరు టౌన్ లిమిట్స్‌లో ప్రవేశించారన్న మాట. వేగాన్ని ఏ మాత్రం తగ్గించకుండా అదే వేగంతో డ్రైవ్ చేస్తూ రైల్వే స్టేషన్ వైపు వెళుతూంది ప్రవీణ్ బుల్లెట్.

అతని మనసంతా ఆందోళనగా వుంది. అతని ఆందోళనకి కారణం హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ నెల్లూరు స్టేషన్‌లో అరైవెల్ అయ్యి వెళ్ళిపోయి

## దివాళా బ్యాంకుల్లో నోబెల్ బహుమానం

మన దేశంలోని నోబెల్ బహుమతి గ్రహీత లయిన సర్ సి.వి. రామన్, రవీంద్రనాథ్ ఠాగూర్‌లు ఈ బహుమతి ద్వారా లభించిన మొత్తాన్ని అనుభవించలేకపోయారు. దానికి కారణం వారిరువురూ సొమ్ములు దాచుకున్న బ్యాంకులు దివాళా తీయడమే. 1913లో తనకు 'నోబెల్' ద్వారా లభించిన మొత్తాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ ఓ బ్యాంకులో భద్రపరిచారు. కాలక్రమంలో ఆ బ్యాంకు దివాళా తీయడంతో ఆయన సొమ్మును కోల్పోయారు. 1930లో రామన్ కూడా తాను నోబెల్ బహుమతి ద్వారా పొందిన సొమ్మును బెంగుళూరుకు చెందిన ఓ బ్యాంకులో వేశారు. దురదృష్టవశాత్తూ ఈ బ్యాంకు కూడా దివాళా తీయడంతో రామన్‌గార్కి బహుమానం వుపయోగపడ్లేదు.

— జి. వనిపిరెడ్డి, వి. సావరం

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

వుంటుందేమోనని అతని ఆందోళన. వెనుక కూర్చున్న జయదేవ్‌కి మాత్రం అంత స్పీడ్ డ్రైవింగ్‌కి కోపంగానూ, భయంగానూ వుంది.

కానీ... విపరీతమైన వేగంలో కూడా వదుపుగా డ్రైవ్ చేస్తున్న ప్రవీణ్ డ్రైవింగ్ టేలెంట్‌ని మనసులో మెచ్చుకోకుండా వుండలేక పోతున్నాడు. ఇలా ఆలోచిస్తున్న జయదేవ్ రైల్వేస్టేషన్ దగ్గర తమ వెహికిల్ ఆగడం గమనించలేదు.

"దిగండి డాడీ... త్వరగా" అంటూ వెహికల్‌ని పార్కింగ్‌లో స్టాండ్ వేసి తండ్రి చేతిలోంచి బ్రీఫ్ కేస్ అందుకుని స్టేషన్‌లోంచి పరుగులాంటి నడకతో ప్లాట్ ఫాం మీదకెళ్ళారు.

కానీ... ప్లాట్ మీదకి ట్రైన్ ఇంకా రాలేదు!

జయదేవ్‌కి ఆశ్చర్యంగా వుంది. ప్రవీణ్‌కి గర్వంగా వుంది.

ప్రయాణీకులు ప్లాట్ ఫాం మీద రాబోయే ట్రైన్ కోసం ఎదురు చూస్తూ నిండుగా వున్నారు. ట్రైన్ ఇంకా రాలేదన్న విషయం తెలుసుకున్న ప్రవీణ్ రిలాక్సింగ్‌గా తన కళ్ళకున్న స్పెక్ట్స్ తీసి కర్చీఫ్‌తో తుడుస్తున్నాడు.

జయదేవ్ వుండబట్టలేక ప్లాట్ ఫాం మీదున్న ఓ పోర్టర్‌ని అడిగాడు.

"ఏం బాబూ ఇంకా ట్రైన్ రాలేదేంటి?"

"ఇంకా రాలేదయ్యగోరూ... లైన్ క్లియర్‌గా లేదని అవుటర్‌లో ఆపేశారు. ఇంకో అయిదు నిమిషాల్లో బండి టేషను కొచ్చేత్తాది" చెప్పాడు.

ట్రైన్ నిదానంగా ట్రాక్‌మీద వస్తూ కనిపించింది.

ప్లాట్ ఫాం మీదకి నిదానంగా వస్తున్న రైలుని చూస్తే జయదేవ్‌కి "నీ కొడుకు డ్రైవింగ్ టేలెంట్‌తో నేను పోటీ పడి ఓడిపోయానని ఒప్పుకుని సిగ్గుతో నిదానంగా వదుస్తున్నట్లనిపిస్తోంది.

ట్రైన్ ప్లాట్ ఫాం మీద ఆగడం, టీ.టీ.ఇ.ని ఎంక్వైరీ చేసి తమ కోచ్ దగ్గరకెళ్ళి బ్రీఫ్‌ని బెర్త్ మీద పడేసి వచ్చి ఫుడ్ బోర్డ్ పట్టుకుని ప్లాట్ ఫాం మీద నిలుచున్న ప్రవీణ్‌తో చెప్పాడు జయదేవ్. "థాంక్యూ ప్రవీణ్ నీ స్పీడ్ డ్రైవింగ్‌ని తగ్గించమని ఎప్పుడూ చెబుతుండేవాణ్ణి. ఆ స్పీడ్ డ్రైవింగే ఈ రోజు నాకు మేలు చేసింది. బట్... ఇలాటి ప్రమాదకరమైన సాహసాలు ఎప్పుడూ... మనకు మేలు కలుగజేయలేవు. ఆ... బైదిబై నీ ఢిల్లీ ఇంటర్వ్యూకి బాగా ప్రిపేర్ అయ్యావుగా... పో రేపు నువ్వు కూడా ఢిల్లీ వెళుతున్నావన్నమాట. ఇంటర్వ్యూ బాగా చెయ్యి. బెస్టాఫ్‌లక్. నేను కాన్ఫరెన్స్ నుండి రాగానే నీకు చక్కటి బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను. ఆ బహుమతి నీకు జీవితంలో ఉపయోగపడే విధంగా వుంటుంది!"

"థాంక్యూ డాడీ. థాంక్యూ వెరీ మచ్" చెప్పాడు ప్రవీణ్.

మరో క్షణంలో సిగ్నల్ ఇవ్వగానే ట్రైన్ మూవయ్యింది. తను ప్రవీణ్‌కి ఎలాంటి బహుమతి ఇవ్వాలా అని ఆలోచిస్తూ తన బెర్త్ దగ్గరికి నడిచాడు జయదేవ్.

* * * *

అతని ఆలోచనలతో పాటు రైలు కూడా వేగాన్ని పుంజుకుంటోంది.

"హలో... ఇటీజీ సూపర్ ఆటో కన్సల్టెంట్స్...?"

"యస్సర్... చెప్పండి!"

"మరేం లేదు మా దగ్గర మంచి ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ వుంది. దాన్ని అమ్మేయాలనుకుంటున్నాం"

"మీ అడ్రస్ చెప్పండి సార్. మేం అక్కడికొచ్చి బండి కండీషన్ మోడల్ చూసుకుని రేట్ ఫిక్స్ చేసుకుంటాం"

"ఓకే" తన అడ్రస్ చెప్పాడు జయదేవ్.

మరో గంట సేపట్లో సూపర్ ఆటో కన్సల్టెంట్స్ మనిషివచ్చి బండిని చూసి ఓసారి ట్రైల్ వెళ్ళి "బండి మంచి కండీషన్‌లో వుంది. కొత్త బండి ఇరవై తొమ్మిది ముప్పై వేల దాకా వుంది సార్... దీన్నయితే ఇరవై రెండు వేలకి కొంటాం. కానీ రెండు మూడు రోజులు టైమ్ పడుతుంది సర్"

"నో...నో వీలయినంత వరకు ఈ రోజే బండిని సేల్ చేసెయ్యాలనుకుంటున్నాం.

"ఈ రోజే అంటే... ఇరవై వేల రూపాయిలు మాత్రమే పే చెయ్యగలం సార్" చెప్పాడతను.

రెండు మూడు రోజులాగితే ప్రవీణ్ ఢిల్లీ నుండి వచ్చేస్తాడు. ప్రవీణ్ వూర్లో వుంటే బండిని అమ్మడానికి కుదరదు. కానీ రెండు రోజుల్లో రెండు వేల రూపాయిలు నష్టపోవాల్సొస్తుంది. అయినా ఫర్వాలేదు!

"ఓకే అలాగే కానివ్వండి. నాకు ఈ రోజు వీలయినంత త్వరగా కేష్ పే చెయ్యాలి" చెప్పాడు జయదేవ్.

అంతే... మరో గంటలో మిగతా కార్యక్రమాలన్నీ పూర్తయ్యి ఇరవై వేల రూపాయిలు జయదేవ్‌కి అందించాడు ఆటో కన్సల్టెంట్.

అప్పటికప్పుడు ఇరవై వేలు తీసుకుని పోస్ట్ ఆఫీస్‌కి వెళ్ళాడు జయదేవ్.

మరుసటి రోజు ప్రవీణ్ ఢిల్లీ నుండి తిరిగొచ్చాడు.

"హాయ్... డాడీ, మమ్మీ... గుడ్ న్యూస్ ... నేను ఇంటర్వ్యూలో సెలక్టయ్యాను" ఆనందంగా చెప్పాడు ప్రవీణ్.

"కంగ్రాట్స్ ప్రవీణ్" చెప్పాడు జయదేవ్.

"చాలా సంతోషం బాబూ" చెప్పింది అన్నపూర్ణమ్మ.

"డాడీ మొన్న నాకు ఏదో బహుమతి ఇస్తానన్నారుగా కమాన్... కమాన్... త్వరగా త్వరగా ఇవ్వండి!" ఆత్రుతగా అడిగాడు ప్రవీణ్.

"ఇస్తా... ఇస్తా" అంటూ ఇరవై వేల రూపాయిలకు కొన్న 'ఇందిరా వికాస పత్రాలు' షెల్ఫ్‌లోంచి తెచ్చి ప్రవీణ్ చేతిలో వుంచాడు జయదేవ్.

వాటిని చూసిన ప్రవీణ్ ఆశ్చర్యపోయాడు.

"డాడీ ఇరవై వేల రూపాయిల 'ఇందిరా వికాస పత్రాలు' ... నా కోసం..."

"అవును ప్రవీణ్ నీ కోసమే...!"

"థాంక్యూ డాడీ... థాంక్యూ వెరీమచ్... ఈ శుభ సందర్భంలో నా బుల్లెట్ మీదవెళ్ళి ఫ్రెండ్స్ అందర్నీ కలిసి నేను ఇంటర్వ్యూలో సెలక్టయిన విషయం చెప్పాలి. వెళ్ళొస్తా డాడీ..." చెప్పి వెళ్ళబోయాడు.

"ఆగు ... ఆగు ప్రవీణ్! నీ బండి మనింట్లో లేదిప్పుడు! దాన్ని అమ్మేశాను. ఆ డబ్బుతోనే ఈ 'ఇందిరా వికాస పత్రాలు' కొన్నాను. నువ్వు మొన్న ముప్పై అయిదు కిలోమీటర్ల దూరాన్ని ట్రైన్‌తో రేజ్ చేసినప్పుడు తాత్కాలికంగా సంతోషించినా ... తర్వాత తీవ్రంగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను. నీ డ్రైవింగ్ స్పీడ్‌ని బ్రేక్ వేయడానికి ఇంత కంటే మార్గం కనిపించలేదు. సారీ ప్రవీణ్. స్పీడ్ బ్రేకర్ చిరాకు కలిగిస్తుంది. నిజమే కానీ అది మన మేలు కోరేదే.

తండ్రి వంకా, తన చేతిలోని 'ఇందిరా వికాస' పత్రాల వంకా ఆశ్చర్యంగా చూస్తూ అలాగే నిలబడి పోయాడు ప్రవీణ్. తను కొడుకూ, ఆయన తండ్రీ అన్న సంగతి ప్రవీణ్‌కి అర్థమయిందప్పుడు.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్